జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 15-09-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 124 పేజీలు: 8 వెల: రూ.7

# గిరిజనులను అండగా.. కమిషన్

* వారి ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా * జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ * కేరాసింగి, గూడ, మాకివలస గిరిజన గ్రామాల్లో పర్యటన



**మెళియాపుట్టి/జలుమూరు, సెప్టెంబర్14 (వార్త):** మారుమూల గిరిజన ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి తెలుసుకుంటున్నాం.. వాటి పరిష్కారానికి కృషి చేసి ఆదుకుంటాం.. వారికి కమిషన్ అండగా ఉంటుంది.. అని జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మెళియాపుట్టి మండలంలో గిరిశిఖర గ్రామాలైన కేరాసింగి, గూడ గిరిజన గ్రామాలను బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక గిరిజనులతో మమేకమవుతూ సమస్యలేంటి, ఏ రకమైన సేవలు అందుతున్నాయి, తదితర వాటిపై మాట్లాడి తెలుసుకున్నారు. ప్రధానంగా రహదారి, తాగునీరు, వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నామని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మీరు వస్తున్నారని తెలిసి మా గ్రామాలకు రోడ్డు పనులు చేపడుతున్నారని తెలిపారు. మేము ఉన్నామా? లేమా! అనేది ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనిపై కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. అధికారులతో పని చేయించుకోవడం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ప్రశ్నించే తత్వం ఉంటేనే పనులు జరుగుతాయన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కానట్లయితే ఫిర్యాదు రూపంలో తనకు ఆన్లైన్లో పంపించినట్లయితే తాను స్పందిస్తానన్నారు. గిరిజన సంఘ నాయకులు వాబ యోగి, బైరిసింగి లక్ష్మీనారాయణలు పలువురు మాట్లాడుతూ మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటుకు జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సిఫారసు చేయాలని కోరారు. ఆయన వెంట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్ త్రిపాఠి, ఆర్. మిశ్రా, టెక్కలి ఆర్డీఓ సుదర్శన్ దొర, తహసిల్దార్ హనుమంతరావు, ఎంపీడీవో చంద్రకుమారి, జడ్పిటిసి గూడ ఎండయ్య, స్థానిక సర్పంచ్ ప్రతినిధి అప్పారావు, ఇంజనీరింగ్ అధికారులు, ఐసిడిఎస్, గిరిజన, హౌసింగ్, అటవీ శాఖ, విద్యాశాఖ, వివిధ శాఖధికారులు, సిబ్బంది, గిరిజన సంఘ నాయకులు వాబ యోగి బైరిసింగి లక్ష్మీనారాయణ, శాంతారావు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు శరత్ కుమార్, తేజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కమిషన్ ముందు మాకివలస గిరిజనుల ఏకరువు

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ జలుమూరు మండలంలో బి మాకివలస గ్రామాన్ని సందర్శించారు. అక్కడి గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను కమిషన్ సభ్యుడి వద్ద ఏకరువు పెట్టారు. ఈవిషయమై తహశీల్దార్‌ను అడగ్గా గ్రామంలో భూములన్నీ సత్యనారాయణ గుప్తా అనే భూస్వామి తన పేరు మీద నమోదు చేసుకున్నట్టు రెవెన్యూ రికార్డులు ఉన్నాయని తెలిపారు. గిరిజనులకు కొందరు అధికారులు అన్యాయం చేస్తున్నట్టు తనకు కనిపిస్తుందని, దీనిపై తగు చర్యలు చేపడతామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ గ్రామంలో గిరిజనులు కేవలం 20 సంవత్సరాలుగా నివసిస్తున్నట్టు తప్పుగా నమోదు చేసినట్టు గుర్తించారు. గ్రామ రికార్డులన్నీ తారుమారుగా చేసినట్టు కనిపిస్తున్నాయని, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. అంతకుముందు గిరిజనులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, భూములను ఏవిధంగా పెత్తందారు స్వాధీనం చేసుకుంటున్నది, కొందరు రెవెన్యూ, పోలీసు అధికారులు తమను హింసిస్తున్న వైనాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ దృష్టికి తీసుకువెళ్లారు.

## ఆదిత్యుని సన్నిధితో కమిషన్ సభ్యుడు

అరసవల్లి సూర్యనారాయణస్వామిని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ బీజేపీ నాయకులు బిర్లంగి ఉమామహేశ్వరరావుతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆయనను ఘనంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.



# బైబై.. గణేషా

**శ్రీకాకుళం టౌన్, సెప్టెంబరు14 (వార్త):** జిల్లాలో గణనాథుని నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులు పాటు ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శ్రీకాకుళం పాలకొండ రోడ్డులోని గణపతి మందిరంలో నిత్య హెూమాలు నిర్వహిస్తున్నారు. పలు మండపాల వద్ద అన్నసమారాధన చేస్తున్నారు. ఒకవైపు పూజలు, మరోవైపు గణపతి విగ్రహాలను నిమజ్జనోత్సవం ఘనంగా జరుగుతున్నాయి. శనివారం పెద్ద ఎత్తున గణనాథుల ప్రతిమలను పూజల అనంతరం నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదులతో పాటు కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. డీజే సౌండ్లు, కోలాటం మధ్య యువత కేరింతలు కొడుతూ నిమజ్జనోత్సవంలో పాల్గొంటున్నారు. శ్రీకాకుళం నగరంలోని పాతవంతెన వద్ద నాగావళి నదీ తీరాన అర్ధరాత్రి వరకు నిమజ్జనోత్సవాలు జరిగాయి. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.

# టెక్కలి జిల్లా ఆసుపత్రి అధికారులపై.. అచ్చెన్న ఆగ్రహం



* మరోసారి జిల్లా ఆసుపత్రి సందర్శన * పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం * ఆర్థిక సమస్యలున్నా పేదలకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు * ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల విశ్వాసం పెంచేలా సేవలు అందించండి *అధికారులను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు

**టెక్కలి, సెప్టెంబర్14(వార్త):** టెక్కలి జిల్లా ఆసుపత్రిని మరోసారి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం సందర్శించారు. లిఫ్ట్ పనిచేయక పోవడాన్ని గమనించి వైద్యాధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం వద్దని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల విశ్వాసం పెంచేలా సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఎక్కడా రాజీపడకుండా వైద్యరంగానికి ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. వైద్యులు తమ విధులను మరింత బాధ్యతతో నిర్వహించాలని, చిన్నపాటి నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం కాకూడదని ఉద్బోధించారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సిమ్మన్న, డిసిహెచ్ఎస్ డా.కళ్యాణ్ బాబు, టీడీపీ నాయకులు బగాది శేషగిరిరావు, కోళ్ల లవకుమార్, మట్ట పురుషోత్తంరావు, హనుమంతు రామకృష్ణ, లాడే శ్రీను, ప్రసాద్ రెడ్డి, మామిడి రాము పాల్గొన్నారు. అనంతరం టెక్కలి గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లపాటు బీమాను కూడా గత ప్రభుత్వం రైతులకు చెల్లించ లేదని మంత్రి అచ్చెన్న అన్నారు. అసెస్మెంట్ లేనివారు తక్షణమే వేయించుకునేలా చూడాలన్నారు. టెక్కలి పట్టణం అత్యంత సుందరీ కారణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. త్వరలో సులభ కాంప్లెక్స్‌లు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేకపోయిందని విమర్శించారు. రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకునేది తెదేపా ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఇటీవల విజయవాడలో వరదల కారణంగా నష్టపోయిన వారికి ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. వైసీపీ నాయకులు వరద బాధితులను పరామర్శించేందుకు చుట్టం చూపుగా వచ్చి వెళ్లారని తెలిపారు.



# దొంగకు దేహశుద్ధి

**హిరమండలం, సెప్టెంబరు 14 (వార్త):** ఆంజనేయ స్వామి ఆలయంలో ఓ దొంగ శుక్రవారం చోరీకి పాల్పడుతున్న సమయంలో గ్రామస్థులు పట్టుకుని చితగ్గొట్టారు. వివరాల్లోకి వెళితే.. హిరమండలం మండలం కిట్టాలపాడు గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ఓ వ్యక్తి హుండీని పగులగొట్టి నగదు, సామగ్రి తరలిస్తున్న సమయంలో గ్రామస్థులకు చిక్కాడు. ఆ వ్యక్తిని గ్రామస్థులు అదుపులోకి తీసుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.



## సారాతో ఒకరి అరెస్టు

ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 13 (వార్త): ఒడిశా నుంచి సారా ప్యాకెట్లు తరలిస్తున్న బూర్జపాడుకు చెందిన శివంగి మాధవరావును శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. 9 లీటర్ల సామర్థ్యం గల 50 ప్యాకెట్లు సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈయన తన గ్రామంలో కిరాణా షాప్ నిర్వహిస్తూ సారా అమ్ముతునట్లు తేలిందన్నారు. పట్టు బడిన సారా విలువ రూ.2250లు ఉంటుందని చెప్పారు.





# ఎక్సైజ్ వైఫల్యంతోనే కల్తీ సారా మరణాలు


**-మానవహక్కుల వేదిక ఆరోపణ**

**-మృతుల కుటుంబాల ఫిర్యాదు మేరకు శారదాపురంలో విచారణ**



సోంపేట, సెప్టెంబరు 14 (వార్త): శారదాపురంలో కల్తీ సారా తాగి కొద్ది రోజుల క్రితం ముగ్గురు చనిపోయారని ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ బాధిత కుటుంబాల వారు మానవహక్కుల వేదికకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వాస్తవాల పరిశీలనకు మానవ హక్కుల వేదిక సభ్యులు శనివారం ఆ గ్రామంలో పర్యటించి మృతుల కుటుంబసభ్యుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ధారణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ జగన్నాథరావు, జిల్లా కార్యదర్శి బీన ఢిల్లీరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.వెంకటరావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు తదితరులు గ్రామస్థులను ఆరాతీశారు. ఇటీవల కల్తీ సారా తాగి గ్రామానికి చెందిన బతకల పాపయ్య (52), బద్రి దాలయ్య (68), కొవ్వూరు కృష్ణారావు (53)తో పాటు పక్క పక్క గ్రామాల్లో ఉన్న మరో ఇద్దరు మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి కల్తీసారా యథేచ్ఛగా చుట్టుపక్కల గ్రామాల్లో అమ్ముతున్నా సంబంధిత అధికారులు ప్రేక్షకులుగా మిగిలిపోయారని కమిటీ ఆరోపించింది. దీంతో ఐదుగురు మృతి చెందారన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కూడా గ్రామస్తులు, బాధిత కుటుంబాలు ఫిర్యాదు చేశారన్నారు. ఈనెల 23న గ్రామస్తులతో కలిసి కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తా మని చెప్పారు. ఒడిశా ఆనుకొని ఉన్న గ్రామాల్లో సారా అమ్మకాలను పూర్తిగా నియంత్రించాల్సి అవసరం ఉందని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోకపోతే ఇలా మరిన్ని మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం తగిన నష్టపరిహారాన్ని వీరి కుటుంబసభ్యులకు అందజేసి, ఇటువంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



జలుమూరు, సెప్టెంబరు 14 (వార్త): జలుమూరు మండలం గుండువలస గ్రామానికి చెందిన గొండు త్రినాథరావుకి మోకాలి కీలు మార్పిడి కోసం రూ.1,08,600 ఖర్చయింది. దీనిపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి తెలియజేయగా ఆయన స్పందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. ఈ మేరకు మంజూరైన చెక్‌ను శనివారం మబుగాంలో లబ్ధిదారుడికి అందజేశారు.

## అవగాహనతోనే కేసుల రాజీ



నరసన్నపేట, సెప్టెంబరు 14(వార్త): అవగాహనతోనే కేసులను రాజీ చేసుకోవచ్చని నరసన్నపేట సివిల్ జడ్జి చందక హరిప్రియ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నరసన్నపేట, పోలాకి మండలాలకు సంబంధించిన 114 కేసులు తమ వద్దకు వచ్చినట్లు ఆమె స్పష్టం చేశారు.

# విప్లవాత్మక మార్పులకు డ్రోన్ వ్యవసాయం

నరసన్నపేట, సెప్టెంబరు 14 (వార్త): 'డ్రోన్' వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఎంతోగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కత్తిరివానిపేటలోని తన వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఆయన డ్రోన్ ద్వారా వరి పంటకు యూరియా, డీఏపీ, ఇతర క్రిమి సంహారక మందులు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే రైతులు అధిక దిగుబడి సాధిస్తారని, వ్యవసాయ రంగంలో సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాలని సూచించారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగంలో కూలీల కొరత నివారణకు డ్రోన్‌లను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి, మండల ఏవో చిరంజీవిరావు, రైతులు పాల్గొన్నారు.



## ఇసుక ట్రాక్టర్ సీజ్




పోలాకి, సెప్టెంబరు 14 (వార్త): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. శనివారం ఉదయం పోలాకి మండలం వనవిష్ణుపురం జంక్షన్ వద్ద ఇసుక ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా, అనుమతి లేనట్టు తేలిందన్నారు. దీంతో డ్రైవర్ పులి శంకరరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

# వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఫాగింగ్




మందస, సెప్టెంబరు 14 (వార్త): మందస పంచాయతీలో డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా శనివారం ఫాగింగ్ చేశారు. వికాసతరంగణి ఆధ్వర్యంలో, మందస పంచాయతీ అధికారులు సంయుక్తంగా వీధుల్లో పొగను వెదజల్లారు. ఊరు పరిశుభ్రతకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు శ్రీవాసుదేవ ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు చెప్పారు. ఇటీవల మందసలో జ్వరాలు ఎక్కువగా వ్యాపించడంతో ఫాగింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో బమ్మిడి నవీన్‌కుమార్, అర్చకులు అనిల్‌కుమార్ పాండే, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శానాపతి కిరణ్ కుమార్, దేవరశెట్టి మార్కండేయులు, తిరుపతి, వాయలపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో ట్రా'ఫికర్'



నరసన్నపేట, సెప్టెంబరు 14 (వార్త): నరసన్నపేట జూనియర్ కాలేజీ రోడ్డులో నిరంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని స్థానికులు శనివారం తెలిపారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉందని.. షాప్ యజమానులు వారి సామాన్లను రోడ్డు ముందు డిస్ ప్లే ఉంచుతున్నారన్నారు. బైక్‌లను షాపుల ముందు పార్కింగ్ చేస్తుండడంతో సమస్య పెద్దదవుతుందన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.



## ఆటలతోనే మానసిక ఉల్లాసం

నరసన్నపేట, సెప్టెంబరు 14(వార్త): ఉపాధ్యాయుల్లో మానసిక ఉల్లాసం కోసమే ఆటల పోటీలు నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్ తెలిపారు. నరసన్నపేటలో ఉపాధ్యాయులకు నిర్వహించిన ఆటల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వైకుంఠరావు, నరసన్నపేట మండల అధ్యక్షుడు టి.సుధీర్ తదితరులు తెలిపారు.

## ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

వంగర, సెప్టెంబరు 14 (వార్త): మగ్గూరులో శనివారం వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులందరూ ఈ ఉత్సవంలో పాల్గొని ఊరేగింపు చేపట్టారు. వివిధ రకాల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.



## సీతారాం ఏచూరికి ఘన నివాళి

వంగర, సెప్టెంబరు 14 (వార్త): వంగరలో శనివారం సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు సీతారాం ఏచూరి మాట్లాడుతూ సీతారాం ఏచూరి పేదల కోసం పని చేసిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. టీడీపీ రాజాం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మజ్జి గణపతి మాట్లాడుతూ పార్లమెంటు దృష్టికి ఎన్నో ముఖ్యమైన సమస్యలను తీసుకురావడంతో పాటు వాటిపై ప్రశ్నలు సంధించిన సభ్యునిగా రాజ్యసభలో ఏచూరి గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎం.గణపతి, డర్రు రాంబాబు, చిత్తిరి గంగులు, ఆనంద్, విశ్వనాథం, ఎం.త్రినాథ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 'ప్రభుత్వ నిర్ణయంతో గృహ లబ్ధిదారులకు లబ్ధి'



నరసన్నపేట, సెప్టెంబరు 14 (వార్త): సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారుల కుటుంబాలకు మేలు జరిగిందని పారసెల్లి సర్పంచ్ కిరణ్ చంద్ర పట్నాయక్ తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం పారసిల్లి గ్రామంలో గతంలో ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంలో భాగంగా నిర్మించిన గృహాలను పంచాయతీ అధికారులు పరిశీలించారు. స్థానిక పంచాయతీలో 34 గృహాలకు నిధులు మంజూరు జరిగే అవకాశం ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.



## బావుల్లో క్లోరినేషన్

నరసన్నపేట, సెప్టెంబరు 14 (వార్త): నరసన్నపేటలోని పలు బావుల్లో క్లోరినేషన్ పనులను చేపడుతున్నామని హెల్త్ అసిస్టెంట్ ధనుంజయరావు తెలిపారు. శనివారం ఉదయం స్థానిక బొడ్డవలస, మఠం వీధిలో ఉన్న బావుల్లో బ్లీచింగ్ పౌడర్ కలిపామని చెప్పారు. మాకివలస ప్రాథమిక వైద్యాధికారిణి శిరీష ఆదేశాల మేరకు ఈ పనులను కొనసాగిస్తున్నామన్నారు.

## వీధి కుక్కల హల్‌చల్



సారవకోట, సెప్టెంబరు 14 (వార్త): సారవకోటతో పాటు అలుదు గ్రామంలో వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా అవి తిరుగుతూ పిల్లలను భయపెడుతున్నాయి. ఇటీవల కొన్నిచోట్ల పిల్లలపై కుక్కలు దాడి చేసిన ఘటనలు ఆందోళన కల్గిస్తున్నట్లు వారు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ముమ్మరంగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ



సారవకోట, సెప్టెంబరు 14(వార్త): సారవకోట మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయం వీహెచ్‌ఎలు రైతులతో ఈ-కేవైసీని నమోదు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యంతో పంట నష్టం జరిగితే పరిహారం అందుతుందన్నారు. రైతు తన పంటను కొనుగోలు కేంద్రాలకు విక్రయించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## గోతులమయంగా చీడివలస రహదారి



పోలాకి, సెప్టెంబరు 14 (వార్త): పోలాకి మండలం చీడివలసకు వెళ్లే రహదారి గోతులమయంగా దర్శనమిస్తున్నట్లు స్థానికులు వాపోయారు. దీంతో వాహనదారులు, బాటసారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

## గార ఎస్ఐగా జనార్దన్



గార, సెప్టెంబరు 14 (వార్త): గార పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా రెళ్ల జనార్దన్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి డీపీవో నుంచి గారకు వచ్చారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతామన్నారు.

# క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హరిపురంలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తపల్లిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

మందస, సెప్టెంబరు 14 (వార్త): హరిపురం, కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపారు. వాసుదేవపురంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం, చిన్నబహడపల్లిలో ద్వితీయస్థానం, లింబుగాంలో జరిగిన పోటీలో 5వ స్థానాన్ని కొత్తపల్లి విద్యార్థులు పైల కీర్తన, నెయ్యిల భార్గవి, కోమటి జ్ఞానేశ్వరి, శ్రీజ, గౌతమ్ సింగ్ ఠాకూర్, భవరి సుస్మిత, పైల హారిక, తెప్ప వెన్నెల, ఉగ్రిపల్లి అస్మిత, తిరుపతి, హాసిని సాధించారు. హరిపురం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు చిన్నబహడపల్లి, లింబుగాం, బీఎస్ పురంల్లో ప్రథమస్థానం, ఎకువూరులో తృతీయస్థానం సాధించారు. విద్యార్థులను కొత్తపల్లి, హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఆంగ్ల వ్యాసరచన రాష్ట్ర పోటీలకు వంగర విద్యార్థులు

వంగర, సెప్టెంబరు 14 (వార్త): రాష్ట్రస్థాయి ఆంగ్ల వ్యాసరచన పోటీలకు వంగర విద్యార్థులు ఎంపికయ్యారు. వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శిర్లి యశస్వి, శివ్వాపు దీప్తి, బెవర సిద్దు, టి.లావణ్య ఎంపికైనట్లు హెచ్ఎం ముద్దాడ రమణమ్మ, ఆంగ్ల ఉపాధ్యాయుడు టీచర్ జయకృష్ణ వెల్లడించారు. ఈనెల 13 న వారధి ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఈ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిబేట్ పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయస్థానాన్ని తుంబల లావణ్య సాధించింది.

వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముద్దాడ రమణమ్మ, వంగర మండల విద్యాశాఖాధికారులు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు, వంగర ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, పాఠశాల స్థల దాత సీనియర్ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవరావు నాయుడు, గ్రామ సర్పంచ్ కె.భారతి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రథమ స్థానం సాధించాలని ఆకాంక్షించారు.

# గ్రామ..గ్రామాన అన్న సంతర్పణలు





పోలాకి, సెప్టెంబరు 14 (వార్త): వినాయక నవరాత్రుల మహోత్సవాలు సందర్భంగా సన్యాసిరాజుపేట, పోలాకి గ్రామాల్లో వినాయక మండపాలను బగ్గు రమణమూర్తి శనివారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్న సంతర్పణ గావించారు. కార్యక్రమంలో పోలాకి మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, గార మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు గారు, సూరపు నాని, పంగ శ్రీను, తాడేల మల్లేశ్వరరావు, చిన్నబాబు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఘనంగా కుంకుమ పూజలు..**


**గార:** వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పోర్ట్ కళింగపట్నం, వాడపాలెం గ్రామాల్లో వేద పండితులు ధర్మపురి చరణ్, బిడియం వెంకటశర్మ ఆధ్వర్యంలో శ్రీ లలితా సహస్ర నామం, లక్ష్మీఅష్టోత్తర శతనామాలతో స్వామి వారి సన్నిధానంలో సామూహిక కుంకుమార్చన పూజలు ఘనంగా జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు స్వామి వారి, అమ్మవారి తీర్థప్రసాదాలను కమిటీ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సకలాబత్తుల అనిల్ శివ సంతోష్ కుమార్, వారాది మౌనిక, దుర్రు మౌనిక, కోల కావ్య, గనగళ్ల లక్ష్మి, కోనాడ లతశ్రీ, గనగళ్ల పుష్ప, కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**గోరువానిపేటలో..**

వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గోరువానిపేట గ్రామంలో శనివారం అన్నదానం చేశారు. ఆ గ్రామంతో పాటు నిజామాబాద్, పరిసర గ్రామ భక్తులు వచ్చి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించి ఆశీస్సులు పొందారు.

**వంగర:** వంగర మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుని ఉత్సవాల్లో భాగంగా వినాయకునికి పూజలు నిర్వహించి, అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. మగ్గూరు, సంగాం, ఓనె అగ్రహారం, వంగర, మద్దివలస, ఎం.సీతారాంపురం, బాగింపేట, మడ్డువలస, అరసాడ తదితర అనేక గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు, వినాయక కమిటీల సభ్యులు, యువతీ, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వాలీబాల్ పోటీల విజేత వంగర జట్టు



వంగర, సెప్టెంబరు 14 (వార్త): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రాజాం నియోజకవర్గస్థాయిలో శనివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని 4 మండలాల నుంచి 6 టీమ్‌లు పాల్గొనగా, వంగర మండల జట్టు ప్రథమస్థానం పొందింది. వంగర మండల ఉపాధ్యాయులు తెంటు రవి, సిరిపురం రాంబాబు, బొత్స పట్టాభినాయుడు, పెంకి గౌరీశంకర్‌రావు, బొక్కెల చంద్రమౌళి, సూర జయకృష్ణ, ఎస్.దొరబాబు, డబ్బాడ రాంబాబు జట్లు విజయం సాధించాయి. ఈ విజయంపై మండల విద్యాశాఖాధికారులు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ముద్దాడ రమణమ్మ వంగర జట్టుని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణను నేర్పుతాయని, విద్యా బోధనలో భాగంగా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యూటీఫ్ మండల అధ్యక్షుడు ఎం.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెంకి గౌరీశంకర్‌రావు, కోశాధికారి బి.శ్రీనివాసరావు, యూటీఎఫ్ కమిటీ సభ్యులు విజయం సాధించిన వాలీబాల్ జట్టుకు అభినందనలు తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గణనాథుల మండపాల్లో దీపారాధన

**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 14 (వార్త):** నౌపడ గ్రామంలోని గణనాథుల మండపాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. గణనాథుని తల్లి పార్వతి దేవిని స్మరిస్తూ నౌపడ బజార్ వీధిలో గణేష్ మండపంలో లక్ష్మి గణపతి పీఠాధిపతి విధాత నాగేశ్వర్ శర్మ పర్యవేక్షణలో సామూహిక కుంకుమ పూజలు, లక్ష్మీ గణపతి యజ్ఞం, హెూమం, పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే బజారు వీధి, ఇందిరా కాలనీలో మండపాల వద్ద దీపారాధన చేశారు.

# గిరిజన సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం

*** బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించాలి * ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్**



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 14 (వార్త):** షెడ్యూలు తెగల జీవితాలలో వెలుగు నింపడానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ అన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాటోతు హుస్సేన్ మాట్లాడుతూ ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం ఉద్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని, అర్హులైన ఎస్టీలకు ఉపాధి కల్పనకు వారి ఆదాయాన్ని మెరుగుపర్చడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడం, సరైన శిక్షణ ద్వారా ఎస్టీల్లో నైపుణ్యాలను పెంపొందించాలని ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలోనే ఎస్టీల వినతులు, ఫిర్యాదులను పరిష్కరించాలని తెలిపారు. ఎస్టీల వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగు పరచాలని, 2014- 2019 మధ్య నిర్మించిన వసతి గృహాలకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించాలని, ఎస్టీలకు ఉద్దేశించిన కొన్ని సంస్థలలో గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించని విషయాన్ని సీరియస్ గా పరిగణించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతాలలో రోడ్డు సౌకర్యం లేని గ్రామం రికార్డుల్లో ఉండకూడదని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 2014-2019 మధ్య విడుదల కానీ హౌసింగ్ బిల్లుల విషయంలో వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ విషయంలో పారదర్శకత పాటించాలని సూచించారు. గిరిజన సంఘాలు, ఎస్టీల వ్యక్తిగత ఫిర్యాదులు, విన్నత్తులపై చర్చించి వాటి పరిష్కారానికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిషన్‌కు సివిల్ కోర్టుకుండే అధికారాలుంటాయని మర్చిపోరాదని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, పర్యావరణం, అభివృద్ధి, విద్య, వైద్య రంగాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకారం అందించడమే ఈ సమీక్ష ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. ఈ కమిషన్ రాష్ట్రంలో అన్ని గిరిజన ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు పని చేస్తుందన్నారు. సమీక్షకు భారత ప్రభుత్వ కార్యదర్శి పెండ్లి కళ్యాణ్ రెడ్డి, ఎస్సీఎస్టీ డైరెక్టర్ ఆర్ఎస్. మిశ్రా, రీసెర్చ్ ఆఫీసర్ ఆకాష్ త్రిపాఠి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్ కుమార్ లక్కర్సు, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వం రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## నులిపురుగులను నివారిద్దాం

**జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా.బి. మీనాక్షి**

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 14(వార్త):** నులిపురుగులను నివారించేందుకు పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధి కారిని డా.బి. మీనాక్షి అన్నారు. మంగళవారం డీ వార్మింగ్ డే ను నిర్వహించడం జరుగుతుందని, ఆరోజు మాత్రలు వేసుకోని వారికి డీ వార్మింగ్ మాపాప్ డేను 25వ తేదీన జరుగుతుందన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమము పాఠ శాల ఆరోగ్య పథకంలో భాగంగా ఈ నెల 17న డీ వార్మింగ్ డే నిర్వహించుటకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు డి వార్మింగ్ మాత్రలు (ఆల్బెండజోల్ - 400 మీ.గ్రా.. నమిలి తినిపించడం జరుగుతుందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలలో 1 నుండి 2 సం.ల వరకు 1/2 మాత్ర, 2 నుండి 19 సం.ల వరకు 1మాత్ర చొప్పున స్కూల్స్‌కు వెళ్ళని పిల్లలకు అంగన్వాడి కార్యకర్తల ద్వారా ఈ మాత్రలు వేయిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూలు, కాలేజీలలో ఆల్బెండజోల్ మాత్రలను డీ వార్మింగ్ డే రోజున విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు (ఆల్బెండజోల్-400 మీ.గ్రా.) వయస్సుకు తగ్గ మోతాదును బట్టి నమిలి తినిపించేలా కావలసిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం భోజనం తరువాత ప్రతి విద్యార్థికి మోతాదు ప్రకారం నమిలి మింగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యా శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తల సమన్వయంతో జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మొత్తం 6,689 ఉండగా, అందులో చదువుకొనే విద్యార్థులు 4 లక్షల 70 వేల 738 మంది ఉన్నారు , జిల్లాలో బడికి వెళ్లకుండా ఉన్న పిల్లలు, అంగన్వాడీ కేంద్రాల్లో 1-5 సంవత్సరాల పిల్లలుకు అందజేయడం జరుగుతుందని, మాత్రలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రల వినియోగం శతశాతం జరిగేలా చర్యలు చేపట్టడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల పర్యవేక్షణలో అన్ని పాఠశాలలకు మాత్రలు పంపిణీకి సిద్ధమయ్యాయని తెలిపారు. వైద్య సిబ్బందితో పాటు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాలు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మండల పరిధిలో ఉన్నా పి.హెచ్.సి వైద్యాధికారులు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, సిడిపిఒలు, సిఆర్‌పిలు ద్వారా పర్యవేక్షణ జరుపబడునని, ఈ మాత్రలు వేసుకొనడం వలన ఏవిధమైన ఔషద దుష్పరిణామాలు ఉండవని, ఒకవేళ ఔషధ దుష్పరిణామాలు కనిపించిన యెడల దగ్గరలో ఉన్న స్థానిక ఆశ కార్యకర్త, ఏ.ఎన్.ఎమ్‌ల ద్వారా పి.హెచ్.సి వైద్యాధికారికి సంప్రదించాలన్నారు.

## ట్రాఫిక్ సీఐగా నాగరాజు



**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 14 (వార్త):** ట్రాఫిక్ సీఐగా వి.నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తాను వైజాగ్ సిటీ ట్రాఫిక్ సిఐగా పనిచేసి ఇక్కడికి వచ్చానన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా మైనర్ డ్రైవింగ్‌లకు ఎవరు ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలని తెలిపారు. రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణాలు చేయరాదని, అటువంటి ప్రయాణం చేస్తే ప్రమాదాలకు గురికావాల్సి ఉంటుందని, తప్పనిసరిగా హెల్మెట్ వాడకం చేయాలని తెలిపారు. సెల్ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైట్స్ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

## వన్‌టౌన్ ఎస్ఐగా హరికృష్ణ



శ్రీకాకుళం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎం.హరికృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణకు ఇప్పుడు వన్ టౌన్‌కి బదిలీ అయింది.

## విద్యార్థుల ప్రగతి కార్డుల పంపిణీ

**హిరమండలం, సెప్టెంబరు14 (వార్త):** విద్యార్థి ప్రగతిని పెంపొందించేందుకు ప్రగతి కార్డులు ఉపయోగపడుతుందని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. శనివారం పాతహిరమండలం-2 ఎంపిపి పాఠశాల పరిధిలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రగతి కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ ప్రగతి కార్డులతో విద్యార్థులు ఏయే సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో తల్లిదండ్రులకు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదు

*** పేదలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షే**
*** పవన్ ప్రజలు పక్షాన నిలవాలి**
*** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు**

**పలాస, సెప్టెంబర్ 14(వార్త):** రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని, భవిష్యత్తులో పేద ప్రజలకు వైద్యం అందే పరిస్థితులు ఉండవని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం ప్రగతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నూతన వైద్య కళాశాల విషయంలో టీడీపీ ప్రభుత్వ నిర్ణయం నీట్ విద్యా ర్థులకు శావంగా మారిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ లకు తాను గ్యారెంటీ అన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించాలన్నారు. రాష్ట్రంలో వైద్యవిద్యను పేద విద్యార్థులకు చేరువ చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో ఒకేసారి 17 వైద్య కళాశాలలు నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. గత విద్యా సంవత్సరంలో 5 వైద్య కళాశాలలు నిర్మాణం పూర్తి చేసుకొని జాతీయ వైద్య కమిషన్ అనుమతులు కూడా పొందాయన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో విజయనగరం, మచిలీపట్నం, రాజ మండ్రి, ఏలూరు, నంద్యాల కళాశాలలు ప్రారంభమై ఒకేసారి 750 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు.



కూటమి ప్రభుత్వం నిర్వాకంతో ఈ ఏడాది 700 ఎంబిబిఎస్ సీట్లు రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రారంభమైన 5 కొత్త వైద్య కళాశాలలను ప్రైవేటీవరం చేయడం ద్వారా విద్యార్థులకు వెన్నుపోటు పోదుస్తున్నారని మాజీ మంత్రి సీదిరి విమర్శించారు



## కర్ణాటక యువకుల అరెస్టు

**11.7 కిలోల గంజాయి స్వాధీనం**

**రెండు మొబైల్ ఫోన్లు సీజ్**

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 14 (వార్త):** ఇళ్లకు పెయింటింగ్ లు వేసుకునేందుకు వచ్చి ప్లాస్టింగ్ పనులు చేస్తూ చెడువ్యసనాలకు బానిసై డబ్బులు సరిపోకపోవడంతో గంజాయి రవాణాకి పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కర్ణాటక బెంగళూరునకు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు కర్ణాటక యువకులను అరెస్ట్ చేసినట్లు సిఐ మీసాల చిన్నమనాయుడు చెప్పారు. సర్కిల్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టౌన్ ఎస్ఐ చిన్నం నాయుడుకువచ్చిన సమాచారం మేరకు రైల్వే స్టేషన్ రోడ్డు ఆర్అండ్ బి బంగ్లా వద్ద ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి వద్దనుండి 11.7 కిలోల గంజాయి రెండు మొబైల్ ఫోన్ లను సీజ్ చేసినట్లు చెప్పారు. కర్ణాటక షిమోగి జిల్లా నకు చెందిన రాజేష్ గౌడ్ మరియు అదే జిల్లాకు చెందిన జి మధు లను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.వీరు ఒరిస్సాలో సునీల్ అనే వ్యక్తితో పరిచయమై బెంగళూరు కు గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. కందమాలు, ధరింగబడి వంటి ప్రాంతాల నుండి ఎక్కువగా రవాణా సాగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు నిఘా ఉంచాలని చెప్పారు .అలాగే వి కె పేట రోడ్ లో రత్తకన్న ఎల్ సి గేట్ నుండి డైలీ మార్కెట్ వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించినట్లు చెప్పారు. ఉదయం 8 నుండి 12 మధ్యాహ్నం 3 నుండి 6 మధ్య ప్రాంతంలో వాహనాలు రాకపోకల నిషేధమని చెప్పారు. ఎల్సీ గేటు వద్ద డైలీ మార్కెట్ వద్ద ఇద్దరు సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణ కు వినియోగిస్తున్నట్లు చెప్పారు.

## 17 నుంచి స్వచ్ఛతాహి సేవా

**జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 14 (వార్త):** జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని సూచించారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా వ్యర్థపదార్థాలు తొలగింపు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్, పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎక్కువగా చెత్త పోగయ్యే బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని, పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పర్యాటక ప్రదేశాలు వంటి చోట్ల సామూహిక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్య క్రమ నిర్వహణ కోసం నియోజకవర్గానికి ఒక డ్రోన్ చొప్పున కేటాయిస్తున్నామని వీటి ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ అత్యవసరమైన ప్రదేశాలను సులభంగా గుర్తించ వచ్చన్నారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక గ్రామసభలు, సఫాయి మిత్రలు, పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరిం చాలన్నారు. హెల్త్ చెకప్ లు నిర్వహించాలని, వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి లేనిది పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.

## అన్నదానంలో అపశృతి

**పలాస, సెప్టెంబర్ 14 (వార్త):** అన్నదానం చేస్తుండగా ఓ వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బ్రాహ్మణతర్లా బజారువీధిలో గణపతి నవ రాత్రులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నదానం ప్రారంభం కాగా పూజా కమిటీ లో సభ్యుడిగా ఉన్న పట్నాల తిరుపతిరావు(59) అనే వ్యక్తి భక్తులకు అన్న ప్రసా దాన్ని అందిస్తున్నారు. అకస్మాత్తుగా ఆయన ఛాతీలో నొప్పి ప్రారంభం కాగా పక్కనే ఉన్న మరో సభ్యుడికి విషయాన్ని చెప్పాడు. ఆయన్ను పరీక్షిస్తున్నంతలోపే తిరుపతిరావు కూలబడిపోవడంతో ఆయన్ను స్థానికులు సపర్యలు చేశారు. అనంతరం ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధమవగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమార్తెలు లక్ష్మి, ప్రియాంక ఉన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413